క్లుప్తంగా

జగనన్నతోనే మైనారిటీల సంక్షేమం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌తోనే ముస్లిం మైనార్టీల సంక్షేమం సాధ్యమవుతుందని వక్ఫ్‌బోర్డు జిల్లా అధ్యక్షుడు గౌస్‌మొహిద్దీన్ అన్నారు. భవానీపురం ఐరన్ యార్డు ప్రాంతంలో మసీదు నిర్మాణం నిమిత్తం అక్కడి వక్ఫ్ బోర్డు స్థలం కేటాయించాలని ముస్లిం ఐక్యవేదిక సభ్యులు వక్ఫ్‌బోర్డు కార్యాలయంలో గౌస్‌మొహిద్దీన్‌ను కలిసి గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గౌస్‌మొహిద్దిన్ మాట్లాడుతూ.. స్థల విషయంపై అధికారులతో సమీక్షించి, సానుకూల నిర్ణయం తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రెహ్మాన్, నాయకులు నూర్ ఖాన్, షేక్ సలావుద్దీన్, అహ్మద్ పాల్గొన్నారు.

నేటి నుంచి నోవాటెల్‌లో హైయ్ లైఫ్ ఎగ్జిబిషన్



భవానీపురం(విజయవాడపశ్చిమ): భారతదేశపు ట్రెండ్ సెట్టర్ అయిన హైయ్ లైఫ్ ఎగ్జిబిషన్ ద్వారా అత్యుత్తమ బ్రైడల్ కలెక్షన్‌ను షాపింగ్ చేయవచ్చు. ఈ ఎగ్జిబిషన్ విజయవాడలోని నోవాటెల్ వరుణ్ హోటల్‌లో శుక్రవారం నుంచి మూడు రోజులపాటు కొనసాగుతోంది. ఈ తాజా వెడ్డింగ్ ఎడిషన్ ద్వారా ప్రతిష్టాత్మక వేడుకల్లో వారి సృజనాత్మకతను ప్రదర్శించేందుకు ప్రముఖ బ్రాండ్‌ల వివాహ దుస్తులు, పెళ్లికి అవసరమైన వస్తువులు, ఆభరణాలు అందుబాటులో ఉంటాయి.

ఫిడే ర్యాపిడ్ చెస్ టోర్నమెంట్‌లో ప్రతిభ



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఇంటర్‌నేషనల్ ఫిడే ర్యాపిడ్ చెస్ టోర్నమెంట్‌లో తమ స్కూల్ విద్యార్థి ఉత్తమ రేటింగ్ సాధించారని శ్రీగౌతమ్ స్కూల్ డైరెక్టర్ నల్లాని సూర్యారావు పేర్కొన్నారు. గురువారం స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ పి.తులసీ ఉత్తమ ప్రతిభ కనబర్చిన విజ్ఞి హేమంత్‌కుమార్‌ను అభినందించారు. నెల్లూరులో గత నెలలో జరిగిన ఫిడే ర్యాపిడ్ చెస్ టోర్నమెంట్‌లో హేమంత్‌కుమార్ 1076 రేటింగ్ సాధించారన్నారు. హేమంత్‌కుమార్ భవిష్యత్‌లో మరిన్ని విజయాలను సాధించి నగర కీర్తి ప్రతిష్టలను మరింత పెంచేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో చెస్ కోచ్ ఏ.రామకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

హనుమంతరాయ గ్రంథాలయం అభివృద్ధికి కృషి

విజయవాడకల్చరల్: వెనిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు ఆ గ్రంథాలయం అధ్యక్షుడు డోగిపర్తి శంకరరావు అన్నారు. గ్రంథాలయ ప్రాంగణంలో గ్రంథాలయ సభ్యుల ఆత్మీయ సమావేశం, ప్యూరిఫైర్ వాటర్ ప్లాంట్ ప్రారంభ కార్యక్రమం గురువారం నిర్వహించారు. శంకరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ 90 ఏళ్ల క్రితం గ్రంథాలయం ప్రారంభమైందని ఈ ఏడాది ఆధునిక సొకర్యాలతో గ్రంథాలయాన్ని, కళా వేదికను రూ.25 లక్షల వ్యయంతో పునఃనిర్మించామని తెలిపారు. కార్యక్రమాన్ని సాహితీవేత్త ఎంఆర్ఎస్ ప్రకాశరావు నిర్వహించారు. గ్రంథాలయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ రాంప్రసాద్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. సమావేశంలో విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ పూర్వపు అధ్యక్షుడు బెల్లపు బాబ్జీ, గ్రంథాలయ నిర్వాహక సంఘం సభ్యులు, మహిళా విభాగం అధ్యక్షురాలు దూపాటి శ్రీదేవి, నీలం దుర్గారావు, ఆజం, గడ్డం సత్యనారాయణ పాల్గొన్నారు. వాటర్ ప్లాంట్‌కు సహకరించిన డోగిపర్తి నాగార్జునను నిర్వాహకులు సత్కరించారు.

కూలీ రేట్లపై కార్మికులు సమ్మెకు సిద్ధం కావాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ముఠా కార్మికులు కూలీ రేట్ల పెంపు కోసం సమ్మెకు సిద్ధం కావాలని ముఠా వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) నగర ప్రధాన కార్యదర్శి ఎం సీతారాములు పిలుపునిచ్చారు. వన్‌టౌన్‌లోని చిట్టూరి కాంప్లెక్స్ వద్ద ముఠా కార్మికుల జనరల్ బాడీ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన సీతారాములు మాట్లాడుతూ ఇప్పటికే కూలి రేట్లు గత ఒప్పంద కాలం గడిచి మూడు నెలలు దాటిందన్నారు. ఇప్పటికైనా వ్యాపార అసోసియేషన్లు కార్మిక సంఘాలను పిలిచి చర్చలు జరిపి కూలి రేట్లు పెంచాలని విజ్ఞప్తి చేశారు. లేని పక్షంలో సమ్మె తప్పదని తెలియజేశారు. కార్యక్రమంలో 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్తిబాబు పాల్గొని కార్మికుల సమ్మె పోరాటానికి అన్ని విధాలా సహకరిస్తామని, మద్దతుగా నిలబడతామని తెలిపారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

- మేయర్ రాయన భాగ్యలక్ష్మి
- బాలింతలు, గర్భిణులకు వైఎస్సార్ పోషణ కిట్‌ల పంపిణీ



గర్భిణులు, బాలింతలతో మేయర్ భాగ్యలక్ష్మి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారంతో బాలింతలు, గర్భిణులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చునని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. భీమన వారిపేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మేయర్ భాగ్యలక్ష్మి గర్భిణులకు సామూహిక సీమంతాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి పౌష్టికాహారం తీసుకోవడంతో ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం వారికి నేరుగా కిట్లను పంపిణీ చేస్తుందన్నారు. ప్రభుత్వం అందించిన పౌష్టికాహారంతో ఆరోగ్యవంతమైన శిశువుకు జన్మనివ్వాలన్నారు. అదే విధంగా బాలింతలకు ఇచ్చే ఆహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి నాగమణి, సూపర్‌వైజర్ ప్రశాంతి, అంగన్‌వాడీ కార్యకర్తలు, టీచర్లు, ఎంఎస్‌కేలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

44వ డివిజన్‌లో

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆరోగ్యవంతమైన భావితరాల బిడ్డల కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రారంభించిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని 44వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి అన్నారు. డివిజన్ పరిధిలోని రామరాజ్యనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు ఆరు రకాల పోషక పదార్థాలతో కూడిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ టేక్ హోం రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని ఆమె గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి మైలవరపు దుర్గారావు, ఐసీడీఎస్ సెక్టార్–2 ఇన్‌చార్జ్ సూపర్‌వైజర్ బి.లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు కె.బాజీ, టి.పావని, కె.లక్ష్మి, ఎం.నాగలక్ష్మి, హెల్త్ సెక్రటరీలు వెంకట రమణ, త్రివేణి, షేక్ రంజాన్‌బీ, ఎ.సారమ్మ, హెల్త్ సీఓ పార్వతి, ఎమ్మెస్‌కేలు కనకలక్ష్మి, మహేశ్వరి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



పోషణ్ కిట్‌ను అందజేస్తున్న కార్పొరేటర్ రత్నకుమారి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ గోదావరి గంగ

47వ డివిజన్‌లో..

చిట్టినగర్ 47వ డివిజన్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో స్థానిక కార్పొరేటర్ గోదావరి గంగ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల్లో రక్తహీనత, పౌష్టికాహార లేమిని నివారించేందుకు ప్రభుత్వం అందిస్తున్న టేక్ హోం రేషన్‌ను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. డివిజన్ వైఎస్సార్ సీపీ బాధ్యుడు గోదావరి బాబు, అంగన్‌వాడీ టీచర్లు, హెల్త్ సెక్రటరీలు, ఎంఎస్‌కేలు, ఆయాలు పాల్గొన్నారు.

రైతు బాంధవుడు కాకాని వెంకటరత్నం



కాకాని విగ్రహానికి నివాళులర్పిస్తున్న చైర్మన్ చలసాని ఆంజనేయులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): సామాన్య రైతు కుటుంబంలో పుట్టిన కాకాని వెంకటరత్నం రైతు బాంధవుడిగా, పాడి పరిశ్రమ అభివృద్ధికి విశేష కృషి చేశారని కృష్ణా మిల్క్ యూనియన్(విజయ డెయిరీ) చైర్మన్ చలసాని ఆంజనేయులు పేర్కొన్నారు. కాకాని వెంకటరత్నం 123వ జయంతిని పురస్కరించుకుని గురువారం పాలప్రాజెక్టు ఆవరణలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పాలప్రాజెక్టు పరిపాలనా భవనం వద్ద కాకాని వెంకటరత్నం, కురియన్, ఎన్‌టీఆర్ విగ్రహాలకు చైర్మన్ చలసాని ఆంజనేయులు, ఎండీ కొల్లి ఈశ్వరబాబు నివాళులర్పించారు. ఈ సందర్భంగా చలసాని ఆంజనేయులు మాట్లాడుతూ.. రైతు సమస్యల పరిష్కారానికి నిర్విరామంగా కృషి చేసిన వ్యక్తి కాకాని వెంకటరత్నమని కొనియాడారు. వ్యవసాయ, పశుపోషక, పాల సేకరణ శాఖలకు పలువురు ముఖ్యమంత్రుల వద్ద పని చేసిన కాకాని వెంకటరత్నం, పాడి పరిశ్రమ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారన్నారు. కృష్ణా మిల్క్ యూనియన్ స్థాపనలో ఆయన చూసిన చొరవ, కృషి ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఎండీ కొల్లి ఈశ్వరరావు ఉద్యోగులను ఉద్దేశించి ప్రసంగించారు. పాలకవర్గ సభ్యులు చక్రపాటి, సమితి అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రహదారి, డ్రెయిన్ల పనుల పరిశీలన



సిబ్బందితో మాట్లాడుతున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): అమృత్ పథకం కింద పైప్ లైన్స్ కోసం తవ్విన రోడ్డు పునరుద్ధరణ పనులను వారం రోజుల్లో పూర్తి చేయాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. నియోజకవర్గ పరిధిలోని 42, 43 డివిజన్లలో కమిషనర్ గురువారం పర్యటించారు. అమృత్ పథకం కింద పైప్ లైన్స్ కోసం తవ్విన రోడ్డు పునరుద్ధరణ పనులు, ఊర్మిళ సుబ్బారావు నగర్‌లో మేజర్ డ్రెయిన్ పనులను, పారిశుద్ధ్య నిర్వహణ తీరును క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న రోడ్లు, డ్రెయిన్ పనుల త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన స్థానికంగా సైడ్ డ్రెయిన్లలో మురుగునీరు సక్రమంగా పారేలా ఎప్పటికప్పుడు వ్యర్థాలు తొలగించాలని, పాడైన డ్రెయిన్లకు మరమ్మతులు చేయాలని చెప్పారు. ఈ పర్యటనలో 43వ డివిజన్ కార్పొరేటర్ బాపతి కోటిరెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకటేశ్వరరెడ్డి, నగరపాలక సంస్థ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తల్లి పాలు బిడ్డకు శ్రేష్టం

సీఎంఎస్ డాక్టర్ శౌరిబాల



రైల్వే హాస్పిటల్‌లో అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్లు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ప్రపంచ తల్లి పాల వారోత్సవాలను పురస్కరించుకుని విజయవాడ రైల్వే హాస్పిటల్‌లోని న్యూ ఓపీడీ బ్లాక్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రైల్వే హాస్పిటల్ సీఎంఎస్ డాక్టర్ శౌరిబాల మాట్లాడుతూ శిశువులకు తల్లిపాలు ఇవ్వడం కలిగే ప్రయోజనాలను వివరించారు. చనుపాలు ఇవ్వడం వలన కొందరి తల్లులలో అపోహలు ఉన్నాయని, వాటిని విస్మరించి తప్పకుండా శిశువులకు తల్లిపాలు ఇవ్వాలన్నారు. తల్లి పాలు బిడ్డకు శ్రేష్టమన్నారు. అప్పుడే శిశువుల్లో వ్యాధి నిరోధక శక్తి పెరిగి ఆరోగ్యంగా ఎదుగుతారని తెలిపారు. రైల్వే హాస్పిటల్, రైల్వే స్టేషన్‌లలో తల్లులు బిడ్డలకు పాలిచ్చేందుకు తగిన ఏర్పాట్లు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అనంతరం ఏసీఎంఎస్‌లు డాక్టర్ ఎం.జయదీప్, డాక్టర్ సీతారామ్, గైనకాలజిస్ట్ డాక్టర్ శారద తల్లిపాల విశిష్టతను వివరించారు.

ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలి



కౌన్సెలింగ్ ఇస్తున్న ఏసీపీ భాస్కరరావు, సీఐ కృష్ణమోహన్

మధురానగర్(విజయవాడసెంట్రల్): వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని, పోలీసుల సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఏసీపీ భాస్కరరావు పిలుపునిచ్చారు. సీపీ టీకే రాణా ఆదేశాల మేరకు గుణదల పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం సాయంత్రం సీఐ కృష్ణమోహన్, సిబ్బందితో కలిసి విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా స్ట్రీట్‌వాక్, వాహనాల రికార్డుల చెకింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు తమవంతు సహాయ సహకారాలు అందించాలన్నారు. ఈ సందర్భంగా యువకులకు హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాల్సిన ఆవశ్యకతను, గంజాయి, డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో గుణదల సీఐ కృష్ణమోహన్, ఎస్ఐ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

డీసీపీ ఆకస్మిక పర్యటన

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): నగర పోలీస్ కమిషనర్ టీకే రాణా ఆదేశాల మేరకు డీసీపీ విశాల్ గున్ని అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం ఆకస్మికంగా పర్యటించారు. ప్రధానంగా ఆకతాయిల సమస్యలు అధికంగా ఉంటున్న వాంబేకాలనీ, సింగ్‌నగర్ లూనాసెంటర్, న్యూరాజరాజేశ్వరీపేట శివారు ప్రాంతాలను స్వయంగా పరిశీలించి స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆకతాయిల సమస్యలు, ఇతర శాంతిభద్రతలకు విఘాతం కలిగించే కార్యకలాపాలు ఏమైన ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, ప్రజల వివరాలను గోప్యంగా ఉంచుతామని చెప్పారు. సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి స్టేషన్ నిర్వహణ, సిబ్బంది పనితీరు, విధులు, ముఖ్యమైన కేసుల దర్యాప్తు, స్టేషన్‌లో నిర్వహిస్తున్న కేసు డైరీ, విలేజ్ రోస్టర్‌తో పాటు పలు క్రైమ్ రికార్డులను పరిశీలించి ఎస్‌హెచ్‌ఓలకు పలు సూచనలు అందించారు. నార్త్‌జోన్ ఏసీపీ రవికాంత్, సీఐ గురుప్రకాష్, ఎస్ఐలు దుర్గాదేవి, సత్యనారాయణ, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

జీవో నంబర్ 107, 108లను రద్దు చేయాలి

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాజ్యాంగానికి విరుద్ధంగా సంపన్న వర్గాలకు వైద్య విద్యను అందించేందుకు దోహదం చేసే జీవో నంబర్ 107, 108లను రద్దు చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి డిమాండ్ చేశారు. గవర్నర్‌పేటలోని ఎం.విజ్ఞాన కేంద్రంలో కేవీపీఎస్, ఎస్ఎఫ్ఐ, ప్రజారోగ్యవేదిక ఆధ్వర్యంలో ప్రజారోగ్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.కామేశ్వరరావు అధ్యక్షతన రౌండ్‌టేబుల్ జరిగింది. ఈ సందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో వైద్య విద్యలో సీట్లు అమ్ముకునేందుకు చేసే ప్రయత్నం సరైన చర్య కాదన్నారు. ఈ చర్యను రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు. అనంతరం కార్యాచరణ ప్రణాళికపై తీర్మానం ప్రవేశపెట్టి ఆమోదించారు. ఈ నెల 7న క్షేత్రస్థాయిలో రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించాలని, 8న రాష్ట్ర, జిల్లా అధికారులకు అర్జీలు ఇవ్వాలని, 10న బహిరంగ సంతకాల సేకరణ చేపట్టాలని, వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యాలయం వద్ద మహాధర్నా చేయాలని సదస్సు తీర్మానించింది. సమావేశంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ.అశోక్, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు వై.రాము, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఒంటరి మహిళలకు రేషన్ కార్డుల అందజేత

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం 38వ డివిజన్ పరిధిలో నివసిస్తున్న ఒంటరి మహిళలకు మంజూరైన రేషన్ కార్డులను స్థానిక కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా అందజేశారు. డివిజన్‌లోని వార్డు సచివాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆమె లబ్ధిదారులకు రేషన్ కార్డులను అందించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న ఒంటరి మహిళలకు మంజూరైన కార్డులను అందించామని చెప్పారు. జగనన్న సురక్ష కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువైందని తెలిపారు. గత ప్రభుత్వంలో మాదిరిగా సర్టిఫికెట్ల కోసం ఆఫీస్‌ల చుట్టూ తిరిగి లంచాలు ఇచ్చే పని లేకుండా జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ అన్ని రకాల సర్టిఫికెట్లను ఉచితంగా అందజేశామని చెప్పారు.

పీఎం స్వనిధికి దరఖాస్తుల ఆహ్వానం

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో నివాసం ఉంటూ వీధి విక్రయ వ్యాపారాలు చేసే వారికి పీఎం స్వనిధి పథకం ద్వారా బ్యాంకుల రుణాల మంజూరుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వీఎంసీ పట్టణ సామాజికాభివృద్ధి విభాగం ప్రాజెక్ట్ అధికారి(పీవో యూసీడీ) కె.శకుంతల గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పీఎం స్వనిధి పథకం ద్వారా 7 శాతం వడ్డీరేటుతో వివిధ బ్యాంకుల ద్వారా మొదటి విడతగా రూ.10 వేలు, రెండో విడత రూ.20 వేలు, మూడోవిడత రూ.50 వేలు రుణాలు మంజూరు చేస్తామన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు స్థానిక సచివాలయం వార్డ్ వెల్ఫేర్ సెక్రటరీ లేదా మెప్మా రిసోర్స్ పర్సన్‌లను సంప్రదించాలని సూచించారు. దరఖాస్తు ఆన్‌లైన్ చేయటానికి ఆధార్ కార్డు, ఆధార్‌లింక్ అయ్యిన ఫోన్ నెంబరు, బ్యాంక్ ఎకౌంట్‌తో సచివాలయాల్లో సంప్రదించాలన్నారు.

వీధి కుక్కలను నియంత్రించే దిశగా చర్యలు



సమీక్షిస్తున్న నగర మేయర్ భాగ్యలక్ష్మి, అధికారులు, ప్రజాప్రతినిధులు

పటమట(విజయవాడతూర్పు): నగర పరిధిలో రోజుకు 100 కుక్కలను పట్టుకోవాలని, ఆపరేషన్ యూనిట్‌లో యానిమల్ బర్త్ కంట్రోల్(ఏబీసీ) ఆపరేషన్లు నిర్వహించాలని వీఎంసీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి అధికారులను ఆదేశించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో ఆమె గురువారం వీధి కుక్కల సమస్య పరిష్కారానికి వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. పెంపుడు కుక్కల యజమానులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ పెంపుడు కుక్కలకు యాంటీరేబీస్ వ్యాక్సిన్(ఏఆర్‌వీ) టీకాలు వేయించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. డివిజన్ల వారీగా యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) గురించి మైక్‌ల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. వీధి కుక్కల ప్రేమికులు, కాలనీ ప్రతినిధులతో తరచూ సమావేశాలు నిర్వహించాలని పేర్కొన్నారు. హోటళ్లు, మాంసం విక్రేతలపై సక్రమంగా పారేయని వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. వీధి కుక్కల సమస్యలకు టోల్– ఫ్రీ నెంబర్ 1800 425 2000 వీఎంసీ, 81819 60909 వీఎంసీ వాట్సాప్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ ఫ్లోర్ ఫ్లోర్‌లీడర్ వెంకట సత్యనారాయణ, టీడీపీ ఫ్లోర్‌లీడర్ నెలిబండ్ల బాలస్వామి, సీపీఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు, కార్పొరేటర్లు బీ జానారెడ్డి, శిరంశెట్టి పూర్ణచంద్ర రావు, ఉమ్మడి వెంకటేశ్వరరావు(చంటి), పుప్పాల కుమారి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ రవిచంద్, జంతు ప్రేమికులు, జీవకారుణ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సామాజిక సేవల్లో విద్యార్థులు భాగస్వాములు కావాలి



రోటరాక్ట్ క్లబ్ కార్యవర్గం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సామాజిక సేవల్లో విద్యార్థులు భాగస్వాములు కావాలని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి పి.లక్ష్మణస్వామి అన్నారు. ఆ కళాశాలలోని రోటరాక్ట్ క్లబ్ 14వ ఇన్స్టాలేషన్ ప్రోగ్రామ్ గురువారం సాయంత్రం కళాశాల ప్రాంగణంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన లక్ష్మణస్వామి మాట్లాడుతూ.. 100 ఏళ్ల చరిత్ర కలిగిన హిందూహైస్కూల్స్ కమిటీ ఆధ్వర్యంలో తమ కళాశాల కొనసాగుతుందన్నారు. విద్యా వ్యాప్తితో పాటుగా సామాజిక సేవా రంగాల్లోనూ తమ సంస్థలు ముందు వరుసలో ఉన్నాయని చెప్పారు. రోటరాక్ట్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులుగా కె.సాకేత్, ఉమామహేశ్వరిలు ఎన్నికయ్యారు. వారితో రోటరీ క్లబ్ నుంచి ప్రతినిధులుగా హాజరైన సాధు వీఆర్ ప్రసాద్, పార్థసారథి ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనారాయణ, అధ్యాపకులు పి.నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లకు మార్గనిర్దేశం చేయడమే లక్ష్యం



బీఎల్‌ఓల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఓటర్లకు మార్గనిర్దేశం చేయడమే బీఎల్‌ఓల లక్ష్యమని మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. నగరంలోని సెంట్రల్, వెస్ట్ నియోజకవర్గాల్లో బూత్ స్థాయి అధికారులకు(బీఎల్‌ఓలు) తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గురువారం సమగ్ర శిక్షణా కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ.. సమాచారం, సమ్మిళిత ఎన్నికల ప్రక్రియను ప్రోత్సహించే దిశగా సర్వే నిర్వహించాలని బీఎల్‌ఓలకు సూచించారు. పౌరుల భాగస్వామ్యాన్ని పెంపొందించటం, సమర్థవంతమైన ఎన్నికల ప్రక్రియను నిర్ధారించేందుకు అవసరమైన నైపుణ్యాలతో బీఎల్‌ఓలను శక్తివంతం చేయడమే లక్ష్యంగా ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఇంటింటికీ వెళ్లి ప్రచారాలు చేయడం, అలాగే నివాసితుల నుంచి విలువైన అభిప్రాయాలను పొందడం, కొత్త రిజిస్ట్రేషన్ల కోసం ఫారమ్‌లనే పూర్తి చేసేందుకు అర్హులైన ఓటర్లకు మార్గనిర్దేశం వంటివి చేయడమే లక్ష్యంగా బీఎల్‌ఓలు పని చేయాలన్నారు. ప్రత్యేకించి వారు మరణించిన ఓటర్ల నమోదులు, వలస వచ్చిన వారి ఓట్ల తొలగింపులను నిర్వహించే ప్రక్రియ ఈ శిక్షణ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. పౌరులకు, ఎన్నికల వ్యవస్థకు మధ్య ప్రత్యక్ష కమ్యూనికేషన్ మార్గాలను ఏర్పాటు చేయడంలో బీఎల్‌ఓల ప్రాముఖ్యతను వివరించారు. సెంట్రల్, వెస్ట్ నియోజకవర్గాల ఎమ్మార్వోలు, నగరపాలక సంస్థ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, వీఎంసీ అధికారులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

జేసీ ప్రభాకర్‌రెడ్డిపై తగిన చర్యలు తీసుకోవాలి



జస్టిస్ శంకర నారాయణకు వినతి పత్రం అందజేస్తున్న కనకారావు తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): నాయీబ్రాహ్మణులను కించపరుస్తూ చేసిన వ్యాఖ్యలపై జీఓ ఎంఎస్ నంబర్ 50 ద్వారా తగిన చర్యలు తీసుకోవాలని ఏపీ రాష్ట్ర నాయీబ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఏపీ నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ బోర్డ్ డైరెక్టర్ మల్కాపురం కనకారావు కోరారు. ఈ మేరకు ఆయన గురువారం విజయవాడలోని బీసీ కమిషన్ చైర్మన్ జస్టిస్ శంకర నారాయణను ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కనకారావు మాట్లాడుతూ.. ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నెంబర్ 50 ప్రకారం మంగలి, మంగలోడు, కొండ మంగలి అనే పదాలు నిషేధమని, అయితే ఎల్లో మీడియా చానల్‌లో జేసీ ప్రభాకరరెడ్డి ఇచ్చిన ఇంటర్వ్యూలో మంగలోడు అనే పదాన్ని వాడి నాయీబ్రాహ్మణుల మనోభావాలను దెబ్బతీశాడన్నారు. తమ సామాజిక వర్గీయుల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుండగా టీడీపీకి చెందిన ప్రభాకరరెడ్డి మీడియా ద్వారా చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. ప్రముఖ దేవాలయాల పాలక మండళ్లలో నాయీబ్రాహ్మణులకు స్థానం కల్పించి గౌరవించిన సీఎం జగన్‌కు తామంతా రుణపడి ఉంటామని తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బీసీలంతా ఆయన వెంట ఉండి మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుంటామని స్పష్టం చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో నాయీబ్రాహ్మణ నాయకులు జి.ఉమామహేశ్వరరావు, కిరణ్ కుమార్, గణపతి, బీసీ నాయకులు షేక్ ఆసిఫ్, వెంకటేశ్వరరావు ఉన్నారు.

భర్త వేధింపులపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భార్యను వేధింపులకు గురి చేస్తున్న భర్తపై కొత్తపేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కలరా హాస్పిటల్ ప్రాంతానికి చెందిన కట్టా నవ్యశ్రీదుర్గ 2019లో శ్రీనివాసమహల్ ప్రాంతానికి చెందిన శ్రీనును ప్రేమించి పెళ్లి చేసుకుంది. వీరికి ఒక పాప సంతానం. మార్బుల్ పని చేసే శ్రీను కొంత కాలంగా మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని భార్యను, పాపను పట్టించుకోవడం లేదు. కొద్ది రోజులుగా శ్రీను వాళ్ల అమ్మానాన్నలకు దగ్గరకు వెళ్లిపోయాడు. కాపురానికి ఇకపై రానని చెబుతూ భార్యను వేధింపులకు గురి చేయడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.